క్లుప్తంగా

జీవామృతంతో పంటలకు మేలు



జీవామృతంపై అవగాహన కల్పిస్తున్న శ్రీలేఖ్య

మునగపాక : జీవామృతం ద్వారా పంటలకు మేలు జరుగుతుందని పర్లాకిమిడి సెంచూరియన్ యూనివర్సిటీ బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థి కేశంశెట్టి శ్రీలేఖ్య అన్నారు. మునగపాకలో జీవామృతంపై అవగాహన కల్పించారు. తన శిక్షణలో భాగంగా ఆమె రైతులకు జీవామృతం తయారీలో మెలుకువలు, పంటలకు సోకే వ్యాధులు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఘనంగా కస్తూర్బా గాంధీ జయంతి

మునగపాక : మండలంలోని పాటిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం కస్తూర్బా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు కస్తూర్బా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.మా ఊళ్లో గ్రంధాలయం సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో తమ్మిరాజు, ఏవీఎస్ మూర్తి, యల్లపు సంజీవరావు, ఆడారి దక్షిణామూర్తి, కొయిలాడ నరసింగరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో 104 వైద్య శిబిరం



వాడ్రాపల్లిలో వైద్య సేవలందిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పిలుపునిచ్చారు. మంగళవారం వాడ్రాపల్లిలో ఏర్పాటు చేసిన 104 శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున పిల్లలు, వృద్ధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. డాక్టర్ సంధ్య రోగులకు వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగులాపల్లిలో నేడు గడప గడపకు..

మునగపాక : నాగులాపల్లిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరుతున్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల బుర్ర కథ ప్రదర్శన



బుర్రకథ ప్రదర్శించిన విద్యార్థులు

పాయకరావుపేట : మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల కుమారపురంలో 8వ తరగతి వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా సీత ఇష్టాలు అనే బుర్రకథను, సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించారు. మహిళా విద్య ఆవశ్యకత చాటి చెప్పే బుర్రకథను చాలా ఆసక్తిగా తల్లిదండ్రులు, గ్రామస్తులు తిలకించారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

నక్కపల్లి : మండలంలో రీసర్వే వేగవంతం చేయాలని నక్కపల్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్ నీరజ అన్నారు. మంగళవారం వీఆర్వోలు, సర్వే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జగనన్న సంపూర్ణ భూహక్కు కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందన్నారు. తమ గ్రామాల్లో సర్వే జరుగుతున్న విషయాన్ని సిబ్బంది రైతులకు సర్వే నంబర్ల వారీగా తెలియజేయాలన్నారు. ఈ సర్వే వల్ల రైతుల మధ్య నెలకొన్న సివిల్ వివాదాలు, సరిహద్దు వివాదాలు పరిష్కారమవుతాయన్నారు. అలాగే మ్యూటేషన్ల కోసం, ఇతర రెవెన్యూ పరమైన సమస్యల కోసం వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలన్నారు. పెండింగ్ సమస్యలు ఉండకూడదన్నారు.

ప్రతి ఒక్కరి నమ్మకం జగనన్న

కోటవురట్ల: గత ప్రభుత్వ పాలనతో పోల్చుకుంటే జగనన్న ప్రభుత్వ పాలనలో మీకు మంచి జరిగిందా?..లేదా?..సంక్షేమ పథకాలు కొనసాగించాలా.. లేదా..అంటూ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు నేరుగా ప్రజలను కలుసుకుని వారి అభిప్రాయాన్ని నమోదు చేశారు. లింగాపురం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్-జగనన్నే మా నమ్మకం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలనపై నేరుగా వారి అభిప్రాయాలు తెలుసుకుని వారి అంగీకారంతో ఇంటి గోడపై స్టిక్కర్ అంటించారు. ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని మరింత మెరుగైన పాలన అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని, సీఎం జగన్ పట్ల వారికి ఉన్న అభిమానం తేటతెల్లం అవుతోందన్నారు. ప్రతి మహిళా మళ్లీ జగనే సీఎం కావాలని కోరుతున్నారన్నారు. సీఎం జగన్ పాలనలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రతి కుటుంబానికి అందుతున్నాయన్నారు. లబ్ధి కలగని కుటుంబం లేదని, పిల్లల బంగారు భవిత కోసం మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకుందామన్నారు.

వాణిజ్య సముదాయం ప్రారంభం..

లింగాపురం జంక్షన్‌లో పంచాయతీ నిధులతో నిర్మించిన షాపులను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రారంభించారు. వాణిజ్య సముదాయం ద్వారా పంచాయతీకి మరింత ఆదాయం సమకూరుతుందని ఎమ్మెల్యే అన్నారు. పంచాయతీల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ ఆర్.ఎస్. సీతారామరాజు, సర్పంచులు అనిల్‌కుమార్, కె.శివ కుమార్, పైల శివరామ్, ఎంపీటీసీలు రుత్తల సుజాత, పెట్ల రాంబాబు, పార్టీ నాయకులు బి.కిషోర్, ఎస్.వి.రమణమూర్తి, రుత్తల గోవిందు, కొరుప్రోలు రమణ, పెట్ల వెంకటరమణ, చిన్న, వెంకట్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై హర్షం

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాల అమలు తీరు పై గ్రామాల్లో ప్రజలు, పథకాలు పొందుతున్న లబ్దిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగనన్నే మా భవిష్యత్తు, జగనన్నే మా నమ్మకం అనే నినాదంతో నాయకులు, సచివాలయ కన్వీనర్లు మంగళవారం గుంటపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలు అమలు పట్ల సంతృప్తి చెందుతున్నారా లేదా అని అడిగారు. ప్రతి పథకం కూడా స్వయంగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ, వలంటీర్లు ఇంటికి వెళ్ళి లబ్ధిదారులకు అందించడం పై ఆరా తీశారు. పూర్తిగా లబ్దిదారులు సంతృప్తి వ్యక్తం చేసిన తర్వాత జగన్‌మోహన్ రెడ్డి ఫొటోతో వున్న స్టిక్కరును డోర్‌కి అంటించారు. ప్రభుత్వ పథకాల అమలు పూర్తి సంతృప్తికరంగా వుందని, మళ్లీ మన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డే గెలుపొందాలని లబ్ధిదారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



లింగాపురం జంక్షన్‌లో దుకాణాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



గుంటపల్లి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న కన్వీనర్లు



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే బాబూరావు



రామగిరిలో జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్‌ను అంటిస్తున్న గృహసారథి

చురుగ్గా 'మా నమ్మకం నువ్వే జగన్'

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. పార్టీ శ్రేణులు,సచివాలయ కన్వీనర్లు,గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలపై ప్రచారం చేస్తున్నారు. రామగిరిలో గృహ సారథి పల్లా రాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. గత ప్రభుత్వానికి, నేటి ప్రభుత్వానికి తేడా గుర్తించాలని రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించేందుకు సహకరించాలని కోరారు. 5 ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు నమోదు చేయడంతో పాటు జగన్ మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్‌ను ఇంటి యజమానుల సమ్మతంతో అంటించారు.

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జోరందుకుంది. మండలంలో వెంకటాపురం, కొత్తపట్నం, దిమిలి, వాడనర్సాపురం, గోకివాడ, మామిడివాడ , పంచదార్ల , హరిపురం తదితర గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమం కోసం రూపొందించిన ప్రశ్నలను అడిగి జవాబులను నమోదు చేస్తున్నారు. అనంతరం ఫోన్, డోర్ స్టిక్కర్లను అందజేశారు. దిమిలిలో మంగళవారం రాత్రి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఉప సర్పంచ్, సచివాలయ కన్వీనర్లు నగిరెడ్డి మురళీకృష్ణ, నగిరెడ్డి విజయ మంగాదేవి, వార్డు సభ్యుడు గేదెల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కన్నం బాలాజీరావు పలువురు వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నరేంద్రపురం, హరిపాలెం గ్రామాల్లో...

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని నరేంద్రపురం, హరిపాలెంతో పలు గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ జగనన్న స్టిక్కర్లు అంటించారు. నరేంద్రపురంలో జరిగిన కార్యక్రమంలో మల్లవరం సర్పంచ్ పిన్నంరాజు వాసు, ఎంపీటీసీ రావి నాగలక్ష్మి, శోభన్‌బాబు, చందక శివ, రావి వెంకట్, చందక బాబ్జి, సుంకర రమణ తదితరులు పాల్గొన్నారు. హరిపాలెంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ భర్త మారిసెట్టి సూర్యనారాయణ, ఎంపీటీటీ భర్త ప్రసాద్, సచివాలయం కన్వీనర్ ఎం.వి సీతారాం, ఎస్.ఆదిలక్ష్మి, రాము పాల్గొన్నారు.



దిమిలిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం



నరేంద్రపురంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం



హరిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న కన్వీనర్లు

భూముల కేటాయింపుపై గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

నక్కపల్లి : మండలంలో గునిపూడి, బంగారయ్యపేట గ్రామాలకు ఆస్తులు, భూముల కేటాయింపునకు సంబంధించి మంగళవారం రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖాధికారులు గ్రామసభ నిర్వహించారు. గునిపూడి నుంచి బంగారయ్యపేట పంచాయతీ వేరుపడి చాలా కాలం అయింది. బంగారయ్యపేటకు ప్రత్యేకంగా రెవెన్యూ కేటాయించలేదు. ఈ గ్రామ పరిధిలో ఉన్న భూములన్నీ గునిపూడి రెవెన్యూలోనే ఉన్నాయి. దీంతో బంగారయ్యపేట పంచాయతీకి ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటోంది. స్టాంపు డ్యూటీ, సెస్సులు రావడం లేదని, సర్పంచ్ నర్సమ్మ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గతంలో ఒక పర్యాయం గ్రామసభ నిర్వహించి రెండు గ్రామాలకు కేటాయించాల్సిన సర్వే నంబర్లు భూములు గుర్తించడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ ప్రకారం గునిపూడి గ్రామానికి 920 ఎకరాలు, బంగారయ్యపేట గ్రామానికి 844 ఎకరాలు కేటాయించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు అయినంపూడి చినపేర్రాజు, నర్సమ్మ, ఎస్ఐ శిరీష, సర్వేయర్ మూర్తి, వీఆర్వో బాబు, కార్యదర్శి నర్సింగరావు, నాయకులు మురళి, కొవిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ ప్రజావేదిక నేడు

రాంబిల్లి : సోషల్ ఆడిట్ మండల స్థాయి ప్రజావేదికను రాంబిల్లిలో బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు విచారణ నిర్వహించి ఆయా గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజావేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

రాధాకృష్ణ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా నూకరాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మల్లవరంలో రాధాకృష్ణ యాదవ సంఘం ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. అధ్యక్షులుగా కర్రి నూకరాజు, ప్రధాన కార్యదర్శిగా చంటి, ఉపాధ్యక్షులుగా ధూళి శ్రీనివాసరావు, సభ్యులుగా తలుపులు, ముక్కుర్తి సన్నిబాబు, ముక్కుర్తి రాములు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిన్నంరాజు వాసు, ఎంపీటీసీ రావి శోభన్‌బాబు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో విచారణ

రాంబిల్లి : దిమిలి ఉప తపాలా కార్యాలయంలో మంగళవారం చోడవరం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ విచారణ నిర్వహించారు. సబ్ పోస్ట్ మాస్టర్ శ్రీనివాసరావు సేవలు సక్రమంగా అందించడం లేదని వినియోగదారులపై నిర్లక్ష్యంగా, అగౌరవపరుస్తూ మాట్లాడుతున్నారని ఎ.బి. పరమేశ్వరరావుతో పాటు తపాలా ఉద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చోడవరం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు ఆయన ఫిర్యాదుదారులను, తపాలా ఉద్యోగులను , సబ్ పోస్ట్ మాస్టర్ శ్రీనివాసరావును విచారించారు. కాగా ఫిర్యాదుదారులు సబ్ పోస్టు మాస్టర్‌ను బదిలీ చేయాలని కోరారు. విచారణ అధికారి ప్రతాప్ విలేకరులతో మాట్లాడుతూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ నిర్వహించడం జరిగిందని, ఉన్నతాధికారులకు నివేదికను పంపుతానని పేర్కొన్నారు.

సుబ్బారెడ్డిని కలిసిన పేట నేతలు

పాయకరావుపేట మెయిన్‌రోడ్డు విస్తరణకు వినతి



సుబ్బారెడ్డిని కలిసిన పాయకరావుపేట ప్రజాప్రతినిధులు

పాయకరావుపేట: టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని పాయకరావుపేట మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు మంగళవారం విశాఖపట్నంలో కలిసారు. ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు దనిశెట్టి బాబూరావు, వైస్ ఎంపీపీలు పల్లేల స్వామి, దనిశెట్టి బుజ్జి నేతృత్వంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలు సుబ్బారెడ్డిని కలిశారు. పాయకరావుపేటలో దీర్ఘకాలికంగా పరిష్కరించాల్సిన పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా పాయకరావుపేట మెయిన్‌రోడ్డు విస్తరణ, పలు గ్రామాలకు లింక్ రోడ్ల సమస్యలతో పాటు, మండలంలో పార్టీ పరంగా నెలకొన్న సమస్యలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ఎంపికకు సంబంధించిన విషయాలను సుబ్బారెడ్డి దృష్టికి తీసుకొచ్చినట్టు ధనిశెట్టి బాబూరావు, గూటూరు శ్రీను వాసరావు తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. సుబ్బారెడ్డిని కలిసిన వారిలో లిడ్‌క్యాప్ డైరక్టర్ వేమగిరి కల్యాణి లక్ష్మణ్, ఎంపీటీసీ కో ఆప్షన్ సభ్యుడు కాదా రామకృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు నీలాపు చిరంజీవి రెడ్డి, మత్స్యకార నాయకులు అశోక్ పాల్గొన్నారు.

వైభవంగా తాళ్లమాంబ జాతర



పురుషోత్తపురంలో అమ్మవారికి పూజలు

యలమంచిలి: మండలంలోని పురుషోత్తపురం,పోతురెడ్డిపాలెం,కొత్తలి, రుక్మిణీపురం గ్రామాల్లో మంగళవారం తాళ్లమాంబ అమ్మవారి జాతర వైభవంగా జరిగింది.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.మహిళలు చీర,రవికె,గాజులు, పసుపు కుంకుమలు ఇచ్చి అమ్మవారిని పూజించారు.పురుషోత్తపురంలో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో అమ్మవారిని దర్శించుకునేందుకొచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

డీఎల్‌డీవో విచారణ

మునగపాక : మండలంలోని గణపర్తి గ్రామానికి సంబంధించిన ఫిర్యాదుపై మంగళవారం డీఎల్‌డీవో మంజులావాణి విచారణ చేపట్టారు. గతంలో గ్రామంలో జరిగిన ఎన్నికల్లో ఎంఆర్‌సీలో ఉద్యోగిగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ ఏజెంట్‌గా పాల్గొన్నారని ఈ విషయమై విచారణ చేపట్టాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన చదరం అప్పలనాయుడు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు లక్ష్మీనారాయణను ఉద్యోగం నుంచి తొలగించారు. ఇదిలా ఉండగా జిల్లాపరిషత్ సీఈవో శ్రీరామచంద్రమూర్తి ఆదేశాల మేరకు డీఎల్‌డీవో మంజులావాణి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారునితో పాటు అభియోగం ఎదుర్కుంటున్న లక్ష్మీనారాయణ, ఎన్నికల విధులు నిర్వహించిన అధికారి నుంచి వివరాలు సేకరించారు.

పెదతీనార్లలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: మండలంలో పెద తీనార్లలో మంగళవారం కంటి వైద్య శిబిరం జరిగింది. సర్పంచ్ మైలపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన అంజు కంటి ఆస్పత్రివారి ఈ వైద్య శిబిరం నిర్వహించారు. పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక, యాతపేట తదితర గ్రామాలకు చెందిన సుమారు 200 మందికి కంటిపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారిని అంజు ఆస్పత్రి కాకినాడ తరలించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి పనులు ప్రారంభం

కోటవురట్ల : నీలిగుంట గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ కన్నంరెడ్డి వరహాల బాబు పనులను ప్రారంభించి కూలీలకు శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి ఉపాధి పనులు ప్రారంభమైనట్టు తెలిపారు. రైతులకు ఉపయోగపడేలా ఉపాధి పనులు ఉంటాయని, జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం వంద రోజుల పని పూర్తి చేసుకోవాలన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : గ్రామాల్లో సొంత స్థలాల్లో రెండేళ్లలోపు ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారి గృహ నిర్మాణం పథకం బిల్లు మంజూరు చేస్తామని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. ఎస్.రాయవరం మండలంలో గ్రామాల్లో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలని ఉచితంగా స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి నిధులు పెద్ద ఎత్తున మంజూరు చేశామన్నారు. అయితే అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ కరువు అవ్వడం పట్ల పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు చేపట్టించాలన్నారు. ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. పునాదుల్లో మట్టి సమస్య, స్థానికంగా విద్యుత్, నీరు సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ డీఈ విజయుడు, ఏఈ ప్రసాద్, ఎంపీడీవో రామచంద్రమూర్తి, తహసీల్దార్ శ్యామ్, ఇరిగేషన్ శాఖ డీఈ సుజాత, మండల ఇంజినీర్ దుర్గాశంకర్, ఆర్ఐ వినయ్, ఎస్.రాయవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్స్ అల్లాడ నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకునాయుడు, మైలారు శ్రీనివాసరావు, సర్పంచ్‌లు మల్లే లోవరాజు, కోశెట్టి వెంకటరమణ, దారబోయిన గణేష్ పాల్గొన్నారు.

జనరంజక పాలన జగనన్నకే సాధ్యం

ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు



లాలంకోడూరు గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి : పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. లాలంకోడూరులో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏ కుటుంబానికి ఏయే పథకాల్లో లబ్ధి చేకూరిందో వివరించారు.

ఈ పథకాలు ఎవరు ఇస్తున్నారని ప్రశ్నించగా జగనన్న అనే సమాధానం లబ్దిదారుల నుంచి వచ్చింది. ఈ సంక్షేమ పథకాలు కొనసాగేందుకు జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో వలంటీర్లకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో సమకూర్చిన వాటర్‌ప్రూఫ్ బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, సర్పంచ్ లాలం రమణమూర్తి, వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు డీఎస్ఎన్ రాజు(బుజ్జి) పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సహకార సంఘ అధ్యక్షునిగా మహలక్ష్మినాయుడు



మహలక్ష్మినాయుడుకు రికార్డులు అందజేస్తున్న ఎన్నికల అధికారి పద్మజ

మునగపాక : గంగాలమ్మ గొర్రెల పెంపకందారుల సహకార సంఘ అధ్యక్షునిగా కొర్ని మహలక్ష్మినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం సంబంధిత కార్యవర్గ ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల అధికారిగా పద్మజ హాజరయ్యారు. గొర్రెల పెంపకం దారులంతా ఒకే మాటపై ఉండి ఎన్నిక ఏకగ్రీవమయ్యేలా కృషి చేశారు. సభ్యులంతా మహలక్ష్మినాయుడును ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఎన్నుకోవడంతో పద్మజ సంబంధిత రికార్డులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి



పుస్తకం ఆవిష్కరిస్తున్న అంబేద్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ బుజ్జిబాబు

మునగపాక : ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలని అంబేద్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు పిలుపునిచ్చారు. మునగపాక బీసీ కాలనీలో బీచ్ బాయ్స్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుస్తుందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి యువతరం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు పాటుపడాలి



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు తదితరులు



పూలేకు నివాళులర్పిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్



ఎంజెపీఏపీ పాఠశాలలో...

యలమంచిలి : యలమంచిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం జ్యోతీరావ్ పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. రమణమూర్తిరాజు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి పూలే ఎంతో కృషి చేశారన్నారు. అటువంటి మహనీయుడిని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎంపీపీ గోవింద, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గుప్త, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : నిరుపేదలు ఉన్నత స్థాయికి ఎదగాలని అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని లింగరాజుపాలెం జ్యోతిరావు పూలే పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రసన్న అన్నారు. పాఠశాలలో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పి.ధర్మవరం ఉన్నపాఠశాలలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడె రమణారావు,ఉపాధ్యాయుడు ప్రకాష్ పాల్గొన్నారు.

మునగపాక : బడుగు,బలహీన వర్గాల సంక్షేమం కోసం జ్యోతీరావ్ పూలే ఎంతో కృషి చేశారని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జ్యోతిరావ్ పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు.మునగపాక, మూలపేట సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు,గంగప్పలనాయుడు, ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ పాల్గొన్నారు.

కోటవురట్ల : పూలే ఆశయాలు ఎంతో ఉన్నతమైనవని ఎంపీటీసీ పుట్రేవు వెంకట సూర్యారావు అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.

పదో తరగతి విద్యార్థిని అదృశ్యం



విద్యార్థిని శ్రావణి

యలమంచిలి: పదో తరగతి విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పాలవలస శ్రావణి (16) ఈ నెల 10 వ తేదీ సోమవారం ఉదయం 5 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. శ్రావణి ప్రస్తుతం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తోంది. తల్లిదండ్రులు,బంధువులు ఆమెకోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో విద్యార్థిని తండ్రి నరసింహాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.